క్లుప్తంగా

వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్‌గా జిలకర సుబ్బయ్య



పెనగలూరు (ఓబుల వారిపల్లె) : మండల కేంద్రంలోని కొలువైన వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్‌గా జిలకర సుబ్బయ్యను నియమించినట్లు గ్రామ పురోహితులు చెంచు సుబ్బనరసయ్య తెలిపారు. నాయకులతో పాటు గ్రామస్తులు ఏకగ్రీవంగా జిలకర సుబ్బయ్యను నియమించినట్లు వారు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయాలలో ఆలయ చైర్మన్‌గా తనను ఎంపిక చేసినట్లు రాతపూర్వకంగా ఇచ్చారు. బ్రహ్మోత్సవాలకు ముందే చైర్మన్‌గా నియమించడం విశేషం. అనంతరం ఆలయ చైర్మన్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి చైర్మన్‌గా నియమించేందుకు సహకరించిన గ్రామ పెద్దలు, నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

శీతల గంగమ్మ పూజలు



పూజలందుకున్న శీతల గంగమ్మ

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని పార్వతీపురం గ్రామంలో వెలసిన శీతల గంగమ్మ అమ్మవారికి శుక్రవారం భక్తి శ్రద్ధలతో భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి అభిషేకం, అలంకరణ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, అమ్మవారికి కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలు జరిపారు. అనంతర వచ్చిన భక్తులు అమ్మవారి గుడిచుట్టు ప్రదక్షిణలు చేసి అమ్మవారిని దర్శించుకొని, కాయాకర్పూరాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.


ఇసుక క్వారీ పరిశీలన



నారాయణ నెల్లూరు వద్ద ఇసుక క్వారీని పరిశీలిస్తున్న అధికారులు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : పెనగలూరు మండలానికి మంజూరైన రెండు ఇసుక క్వారీలను శుక్రవారం వివిధ శాఖల అధికారులు పరిశీలించారు. గతంలో నారాయణ నెల్లూరు, కోమంతరాజుపురం గ్రామాల వద్ద ఇసుక క్వారీని మంజూరు చేసి ఉన్నారు. ఇసుక తరలింపు నిలిపివేయడంతో ఆ క్వారీలను రెవెన్యూ శాఖ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, భూగర్భ జల శాఖ, మైన్స్ శాఖలకు సంబంధించి అధికారులు పరిశీలించారు. క్వారీ నివేదికలు ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం



నిర్మాణంలో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం

చిట్వేలి : మండల పరిధిలో నిర్మితమవుతున్న శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి పాత కడప వాస్తవ్యులు మద్దిక శ్రీకాంత్ రెడ్డి, సతీమణి సునందలు శుక్రవారం రూ.5,00,116లు ఆలయ ధర్మకర్త కట్టా రామమోహన్ నాయుడుకు అందజేశారు. కె.కందులవారిపల్లి పంచాయతీ పరిధిలో కంబారాయుడు స్వామి గుడి సమీపంలో నిర్మాణంలో ఉన్న ఆలయానికి విరాళం అందించారు. ఈ సందర్భంగా రామమోహన్ నాయుడు మాట్లాడుతూ విరాళం అందించిన సునందకు, వారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆలయ అభివృద్ధికి దాతలు విరాళాలు అందించాలని కోరారు.

మురికినీరు నిల్వ ఉండకూడదు



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఓబులవారిపల్లె : శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్‌డీ రామ్మోహన్ రెడ్డి, ఎంపీడీఓ కుళ్లాయిస్వామిల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీలలో శానిటేషన్ ప్రక్రియ కచ్చితంగా కొనసాగించాలన్నారు. ఎక్కడా మురికినీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. తాగునీటి సరఫరా సక్రమంగా ఉండాలన్నారు. అలాగే ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కోర్కెలు తీర్చే తల్లులు.. భక్తుల ఆరాధ్య దైవాలు

- వైభవంగా ప్రారంభమైన అమ్మవార్ల జాతరలు
- బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు జరిపించిన భక్తులు
- నేడు ఘనంగా ప్రారంభం కానున్న నాగరపమ్మ జాతర మహోత్సవం



సుండుపల్లె: అలంకారంలో అమ్మవారి మూలవిరాట్



సుండుపల్లె: దర్శనమిస్తున్న నాగారపమ్మ



సుండుపల్లె: మరినమ్మ బోనాలు సమర్పించేందుకు వెళుతున్న గ్రామ ప్రజలు

సుండుపల్లె : మండల పరిధిలోని రాయవరం గ్రామం, జంగంపల్లిలో వెలసిన శ్రీ మరినమ్మ తిరునాల ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూలు, వస్త్రాలు, బంగారు ఆభరణములతో అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మొక్కుబడులు ఉన్న భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. నేడు శనివారం రాత్రికి రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలచే మేళతాళాలు, డప్పు వాయిద్యాల మధ్య చాందినీ బండ్లు కట్టి సాంస్కృతిక కార్యక్రమాలతో తిరునాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలిచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

కోరిన కోర్కెలు తల్లి నాగారపమ్మ

సంతానం లేని వారికి సంతానం ప్రసాదించే తల్లి, ఆపదలో ఉన్న వారికి అపన్నహస్తం ఇచ్చే కరుణామయి, భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారం నాగారపమ్మ జాతర మహోత్సవం శనివారం నుంచి ప్రారంభమైంది. ఈ మహోత్సవానికి పక్క జిల్లాల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించి, పూజలు చేయించారు. మండల పరిధిలోని పెద్దనేని కాలువ గ్రామం, బండకాడ ఈడిగపల్లెలో వెలసిన ఈ దేవత ఉత్సవాలలో భాగంగా శనివారం రోజు ఉదయాన్నే పూజారులు అమ్మవారికి పూలు, వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. శనివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన జరిపి ఉపవాసాలు ఉండి భక్తులు వరపడుట జరుగుతుందన్నారు. రాత్రికి ఉప్పు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం, హరికథ కాలక్షేపం కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే ఆదివారం పుట్టను పూజించుట రాత్రికి అమ్మవారి జాగరణ, ఆసాదివారిచే అమ్మవారి కథ, విరూపాక్షమ్మకు చల్లబోనం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ప్రారంభమైన మారమ్మ జాతర ఉత్సవాలు



నందలూరు: పూజలు నిర్వహిస్తున్న మహిళలు



నందలూరు: ప్రత్యేక అలంకరణలో మారమ్మ

నందలూరు : నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన మారమ్మతల్లి ఆలయంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం అమ్మవారి పొంగళ్ల మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామ పురోహితులు బండాత్మకూరు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం మహాగణపతి పూజతో ప్రారంభించి అనంతరం ధ్వజారోహణం, మహాగణపతి హోమం, మారెమ్మ తల్లి మూలమంత్ర హోమాలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సత్యమ్మ, మారమ్మ తల్లికి 101 టెంకాయలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చనలు, మూలమంత్ర హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు శింగమాల సుబ్బరామిరెడ్డి, దుర్గాప్రసాద్ రెడ్డి, నాగిరెడ్డి, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయం పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

వీరబల్లె : మండలంలో సచివాలయ కార్యాలయాలలో పనిచేస్తున్న సిబ్బంది సమయం పాటించాలని లేదంటే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని సచివాలయాల సిబ్బందికి ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయం పాటిస్తూ తమ విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు సచివాలయానికి వచ్చినప్పుడు వారి అవసరాలను తెలుసుకొని తగు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. రైతులను, ప్రజలు పట్ల నిర్లక్ష్యం వహించకుండా వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్యాలీలో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువతకు ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఫౌండేషన్ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాస్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా పాస్ లేదా ఫెయిల్ అయి 18 – 26 సంవత్సరాల మధ్య వయస్సుగల వారు ఇందుకు అర్హులన్నారు. 35 రోజుల శిక్షణా కాలంలో కంప్యూటర్ స్కిల్, స్పోకన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్‌లో అత్యుత్తమ శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 90004 87423ను సంప్రదించాలన్నారు.

రాష్ట్ర విభజన హామీలను సాధించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు

రాయచోటి అర్బన్ : కేంద్ర ప్రభుత్వం ఏర్పాటులో కీలకపాత్రను పోషించిన టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర విభజన హామీలను సాధించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.ఎల్.నరసింహులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి ఘనవిజయం సాధించి కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో సైతం కీలక భూమిక పోషిస్తోందన్నారు. ఏపీకి 10 సంవత్సరాలు ప్రత్యేకహోదాను ఇస్తామని, విభజన హామీలు నెరవేరుస్తామని హామీయిచ్చిన ప్రధాని మోడీ ఆ తర్వాత విస్మరిచారన్నారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీని, విశాఖ రైల్వేజోన్ ప్రకటన, కడప స్టీల్ ఫ్యాక్టరీ నిర్మాణం తదితర హామీలకు అతీగతిలేదన్నారు. కేంద్రప్రభుత్వం ఏర్పాటులో బీజేపీకి సంపూర్ణ మెజారిటీ లేనందున, టీడీపీ, జేడీయూ పార్టీలపై ఆధారపడిందని, ఈ పరిస్థితిని అనువుగా మార్చుకుని రాష్ట్రంలోని టీడీపీ కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీల అమలును సాధించాలంటూ కోరారు. సమావేశంలో సీపీఐ అన్నమయ్య జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, రాయచోటి కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్, సీపీఐ సీనియర్ నేత పలమనేరు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలల్లో అడ్మిషన్ల స్పెషల్ డ్రైవ్



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న దృశ్యం

సుండుపల్లె : రాష్ట్రంలో ఉర్దూ స్కూళ్లల్లో పిల్లల ఎన్‌రోల్‌మెంట్‌కు ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సమగ్ర శిక్ష అభియాన్ ఏ.ఎ.ఎం.ఓ (ఉర్దూ) సమీవుల్లా ఖాన్, షేక్ మహ్మద్ హాషీం ప్రత్యేకంగా సుండుపల్లె మండలంలో పలు ఉన్నత పాఠశాలలు సందర్శించారు. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు ఉర్దూ స్కూళ్లలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెరగాలని సూచించారు. అనంతరం వారు పలు పాఠశాలలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ ఉర్దూ తిమ్మసముద్రం, మడితాడు ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆరిపుల్లా, అబిదుల్లా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి సన్నిధిలో రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో భద్రకాళి



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

రాయచోటి టౌన్ : పట్టణంలోని వీరభద్ర స్వామి ఆలయంలో కొలువైన భద్రకాళి అమ్మవారికి భక్తులు రాహుకాల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం ఆలయ ఈఓ డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పూలు, పట్టువస్త్రాలు, ఆభరణాలు, నిమ్మకాయల హారాలతో అలంకరించారు. అనంతరం అమ్మవారికి మహిళలు నిమ్మకాయలపై వత్తులు వెలిగించి హారతులు పట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ పూజలలో స్థానిక భక్తులతోపాటు కన్నడ భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

కోళ్లబైలులో ప్రభుత్వస్థలాల ఆక్రమణ



ప్రభుత్వస్థలంలో అక్రమంగా వేసిన షెడ్‌ను పరిశీలిస్తున్న సర్పంచ్ ఆనంద్‌రెడ్డి

మదనపల్లె : కోళ్లబైలు పంచాయతీ కాట్లాటపల్లెరోడ్డులో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని సర్పంచ్ ఆనంద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కోళ్లబైలు పంచాయతీలో ప్రభుత్వస్థలాల్లో కొందరు షెడ్‌లు వేసి ఆక్రమిస్తున్నారన్న సమాచారం మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. అక్రమాలను గుర్తించి, నిలిపివేయాల్సిందిగా హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆనందరెడ్డి మాట్లాడుతూ పంచాయతీలో ప్రభుత్వస్థలాలు అధికంగా ఉండటంతో ప్రతిరోజూ ఏదో ఒకచోట స్థానికేతరులు కబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. రెవెన్యూ అధికారులకు తెలిసే ఆక్రమణలు జరుగుతున్నాయని, లేఅవుట్లలో వసతుల కోసం కేటాయించిన కమ్యూనిటీ స్థలాలు అన్యాక్రాంతమైపోయాయన్నారు.

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

పీలేరు : ప్రభుత్వం నుంచి అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి డిమాండ్ చేశారు. శుక్రవారం విజయవాడలో రాష్ట్ర విద్యాశాఖ కమీషనర్ కార్యాలయంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ పార్వతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరులో కొన్ని ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్నట్లు తెలిపారు. మొదటి, రెండో తరగతుల నుంచే ఒలంపియాడ్, ఐఐటీ పేర్లతో వేలాది రూపాయలు విద్యార్థుల నుంచి దండుకుంటున్నారని ఆరోపించారు. బుక్స్, యూనిఫాం, షూస్, బెల్ట్, టై లాంటి ప్రైయివేట్ స్కూళ్లలో అమ్మరాదని ప్రభుత్వం చెప్పినా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని తెలిపారు. అలాగే జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడీ అరికట్టాలని కోరారు.

అన్నదానం

చిట్వేలి : చిట్వేలి నివాసి, విశ్రాంత ఉపాధ్యాయులు గురుస్వామి 45వ పెళ్లిరోజును పురస్కరించుకొని శుక్రవారం శ్రీ నారాయణ తపోవనం ఆశ్రమంలో వృద్ధులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. మానవత చిట్వేలిశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గురుస్వామి దంపతులకు మానవతా బాధ్యులు, సభ్యులు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

కాలభైరవుడికి విశేష పూజలు



హోమం నిర్వహిస్తున్న భక్తులు

రాయచోటి టౌన్ : యండపల్లె సమీపంలోని గుట్టపై వెలసిన కాలభైరవుడికి విశేష పూజలు నిర్వహించారు. శుక్రవారం అష్టమి సందర్భంగా స్వామి వారికి పూజలు, అభిషేకాలు గావించారు. అనంతరం స్వామి వారి ఆలయంలో హోమం పూజలు జరిపారు. తరువాత స్వామి వారిని పూలు, పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలతోపాటు అన్న ప్రసాదం అందజేసినట్లు ఆలయ ధర్మకర్త ధర్మారెడ్డి తెలిపారు.

గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



నాకాబందీ నిర్వహిస్తున్న ఎస్ఐ, పోలీసులు

పుల్లంపేట : గ్రామాలలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పుల్లంపేట ఎస్ఐ రఘురాం హెచ్చరించారు. శుక్రవారం వత్తలూరు, అనంతసముద్రం గ్రామాలలో ప్రత్యేక బలగాలతో పర్యటించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాలలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించాలని, ఒకరిపై ఒకరు కక్షసాధింపు చర్యలకు పాల్పడరాదన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మల్లూరమ్మకు పాలాభిషేకం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామంలో వెలసియున్న మల్లూరమ్మకు పాలాభిషేకం నిర్వహించారు. శుక్రవారం కావడంతో అమ్మవారికి పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం పలు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

విప్లవ చైతన్యజ్వాల చే గువేరా

కడప ఎడ్యుకేషన్: విప్లవ చైతన్య జ్వాల చే గువేరా అని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు యాదవ్ అన్నారు. శుక్రవారం చే గువేరా జయంతిని కడపలోని ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సీఐ నాగరాజు



సిద్దవటం : ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే అట్టివారిపై కఠిన చర్యలు తప్పవని సిద్దవటం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సీఐ నాగరాజు హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో శుక్రవారం సీఐ నాగరాజు మాట్లాడుతూ మండలంలోని డేగనవాండ్లపల్లె, టక్కోలి పెన్నానది పరివాహక ప్రాంతాల్లో చుట్టు పక్కల ఉన్న గ్రామాలకు చెందిన ట్రాక్టర్ల యజమానులు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు మాకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని ఉన్నతాధికారులకు సమాచారం అందించామన్నారు. ఇసుక ట్రాక్టర్ పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. పెన్నానదిలోకి వాహనాలు వెళ్లకుండా రహదారిని జేసీబీ యంత్రంతో తొలగిస్తామన్నారు. పెన్నానదికి చుట్టుపక్కల ఉన్న రైతులు, ప్రజలు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సిబ్బందికి సహకరించాలని ఆయన అన్నారు.

నిరాధారమైన ఆరోపణలు తగవు



మాట్లాడుతున్న బీసీ నాయకుడు పల్లపు రమేష్

రాయచోటి టౌన్ : తాను ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లుగా (కాజేసినట్లుగా) రాయచోటి రూరల్ పరిధిలోని బోయపల్లెకు చెందిన సిద్ధార్థ గౌడ్ నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదని రాయచోటి వైఎస్సార్‌సీపీ బీసీ నాయకుడు పల్లపు రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాయచోటి – గున్నికుంట్ల రోడ్డుకు సమీపంలో సర్వే నంబర్ 374/4లో 0.74 ఎకరాల భూమి 2005వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం అసైన్డ్ పట్టా ఇచ్చిందని తెలిపారు. పట్టా పొందే సమయంలో తాను రాజకీయాలలో కూడా లేనని తెలిపారు. ఆ భూమి అప్పటి నుంచి మా అనుభవంలోనే ఉందన్నారు. అదే సమయంలో నాతో పాటు మరికొందరి వ్యక్తులకు అసైన్మెంట్‌లో భూమిని ఇచ్చారని చెప్పారు. అలాంటి భూమి తాను అక్రమంగా స్వాధీనం చేసుకున్నట్లు ఆరోపించడం దారుణమన్నారు. ఆ సమయంలో రాయచోటి ఎమ్మెల్యేగా శ్రీకాంత్‌రెడ్డి లేడని తెలియజేశారు. సిద్ధార్థ గౌడ్ కేవలం రాజకీయ నాయకులు, ప్రజల మధ్య చిచ్చుపెట్టేందుకు చేస్తున్న ప్రయత్నంలో భాగమే ఈ విషయాన్ని వివాదం చేస్తున్నాడని వివరించారు.

యువకులు రక్తదానం చేయడం అభినందనీయం



సుండుపల్లె: రక్తదానం చేస్తున్న యువకులు




రాయచోటి జగదాంబ సెంటర్: రక్తదానం చేస్తున్న వారిని అభినందిస్తున్న మైనుద్దీన్

సుండుపల్లె : మండల కేంద్రంలోని పవర్ జిమ్‌లో అంతర్జాతీయ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో 40 మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారని నిర్వాహకుడు డాక్టర్ సయ్యద్ అహ్మద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ హుస్సేన్ మాట్లాడుతూ రక్తదానం చేయడం గొప్ప కార్యక్రమమని, యువకులు ఉత్సాహంగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి నిర్భయంగా ముందుకొచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్డి రాణి, ఓబులేశు, రమేష్, జగదీష్, ఎస్టీ సంఘం నాయకులు నాగేంద్ర నాయక్, సహజ సేవకులు భూపతి యాదవ్, అరుణ్, శేఖర్, షారుక్, సల్మాన్, మంజూల, వేణు, ఉమర్, దొరవెల్, జిలాన్, బుజ్జి, భాస్కర్, విజయ్, జుబేర్ మహ్మద్, దీపబ్లడ్ బ్యాంక్ సిబ్బంది సులోచన, నరేష్, చంద్రహాసలు పాల్గొన్నారు.

రాయచోటిలో..

రాయచోటి జగదాంబ సెంటర్ : రాయచోటిలోని శ్రీ దీప బ్లడ్ బ్యాంక్ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పలువురు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారని నిర్వాహకుడు డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్ తెలిపారు.

సమాజానికి భాష, సాహిత్యం పట్టుగొమ్మలు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

కురబలకోట : సమాజానికి భాష, సాహిత్యం పట్టుగొమ్మలని తమిళనాడు సేలంలోని పెరియార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సి. గోవింద్‌రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంగ్లీషు, ఫారిన్ లాంగ్వేజెస్ విభాగం ఆధ్వర్యంలో భాష, సాహిత్యంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భాష సాహిత్యం సంపద లాంటిదేనన్నారు. వీటిని కాపాడుకోవాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. విదేశాల్లో విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రాణించాలంటే ఆ దేశ భాషపై పట్టు సాధించాలన్నారు. ఇందుకు తగిన స్కిల్స్ అవసరమన్నారు. విద్యార్థులను పరిశోధనలవైపు ప్రోత్సహించాలన్నారు.

మదనపల్లెలో యోగాపై శిక్షణ

కురబలకోట : త్వరలో జరగనున్న యోగా డేని పురస్కరించుకుని మదనపల్లె పట్టణంలోని ఎస్‌జీఓ హోంలో యోగాపై శిక్షణ ఇస్తున్నట్లు స్థానిక విశిష్ట నేచర్ క్యూర్ యోగా క్లీనిక్ నిర్వాహకులు డాక్టర్ బ్రహ్మ కుమార్ శుక్రవారం తెలిపారు. ప్రతి రోజు ఉదయం ఆరు గంటల నుంచి ఏడు గంటల వరకు గంట పాటు ఈ శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇప్పటికే శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయన్నారు. యోగా మనిషిని శక్తివంతం చేస్తుందన్నారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. విద్యార్థులు, యువకులు, మహిళలు, పెద్దలు ఎవరైనా పాల్గొనవచ్చన్నారు. ఆసక్తిగల వారు హాజరు కావచ్చని తెలిపారు. వివరాలకు 9515868030ను సంప్రదించవచ్చని తెలిపారు.